ప్రజాశక్తి

బుధవారం 24 జనవరి 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



గుంటూరు జిల్లా తాడేపల్లి సమ్మె శిబిరం వద్ద టపాసులు పేలుస్తున్న అంగన్వాడీలు



పల్నాడు జిల్లా క్రోసూరు మండల కేంద్రంలో సిఐటియు జెండాలు పట్టుకుని నృత్యాలు చేస్తున్న అంగన్వాడీలు

సుదీర్ఘ సమ్మె అనంతరం ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లను అంగీకరించడంపై అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ పలు పండుగలకు దూరమై సమ్మె నినాదాలు చేసిన వారు సమ్మె విజయంతో సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకోవడంతోపాటు కేకలు కట్‌చేసి, టపాసులు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల సిఐటియు జెండాలను పట్టుకుని నృత్యాలు చేశారు. తమకు అన్ని విధాలా అండగా నిలిచిన సిఐటియు, సిపిఎం, ఇతర పార్టీలు, సంఘాలు, మీడియాకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

వైసిపికి రాజీనామాల సెగ!

ఎంపి లావు రాజీనామాతో కలకలం - అదే బాటలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి? - కొత్త సమన్వయకర్తలపై రీ సర్వే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసిపి ప్రజా ప్రతినిధుల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. రానున్న ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించిన వెంటనే అసమ్మతి భగ్గుమంది. తొలుత మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి, వైసిపికి రాజీనామా చేశారు. ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన వైసిపి సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం పార్టీలో కలకలం రేపింది. నర్సరావుపేట లోక్‌సభకు బిసి అభ్యర్థిని ఎంపిక చేసేందుకు శ్రీకృష్ణదేవరాయులును గుంటూరులో పోటీ చేయమన్నారని, అందుకు ఆయన అంగీకరించలేదని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీ నుంచి ఎవ్వరు వెళ్లినా నష్టం లేదని వ్యాఖ్యానించారు. అయితే గుంటూరు లోక్‌సభ పరిధిలో వైసిపికి సానుకూల పరిస్థితులు లేకపోవడం వల్ల శ్రీకృష్ణదేవరాయులు విముఖత చూపారు.

తాజాగా పల్నాడు జిల్లాలో కూడా వైసిపికి



అననుకూలత ప్రారంభమైందని స్వీయ సర్వేలో వెల్లడి కావడంతో శ్రీకృష్ణదేవరాయులు ముందస్తుగా పార్టీ నుంచి వైదొలిగారని సమాచారం. ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానంలో మంగళగిరి నియోజకవర్గంలో సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించినా వైసిపిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అధికార పార్టీ తయారైంది. జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఇక్కడి పరిస్థితులు చక్కదిద్దలేకపోవడం వల్ల ఇటీవల కాలంలో పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి రంగంలోకి దిగి గంజి చిరంజీవి కోసం క్షేత్రస్థాయిలో చిన్నపాటి నాయకుల ఇళ్లకు వెళ్లి మంతనాలు జరపాల్సి వచ్చింది. టిడిపి నుంచి మంగళగిరిలో నారా లోకేష్ పోటీ చేస్తుండటంతో వైసిపికి ఈ సీటు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. కానీ గంజి చిరంజీవికి సానుకూల పరిస్థితిని కల్పించడానికి వైసిపి నాయకులు తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళగిరిలో కాంగ్రెస్ నుంచి ఆళ్ల రామకృష్ణారెడ్డి పోటీ చేస్తే వైసిపి ఓటు బ్యాంకుకు భారీగా గండిపడే ప్రమాదం ఉండటంతో వైసిపిలో కలకలం బయలుదేరింది.

బిసిలకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పుకుంటున్నా ఆ తరగుతుల్లోనే వ్యతిరేకత పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గత కొన్ని రోజులుగా అసమ్మతి స్వరం విన్పిస్తున్నారు. ఆయన తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇస్తేపార్టీలో కొనసాగాలని లేదంటే పార్టీ నుంచి తప్పుకోవాలని ఆలోచిస్తున్నారు. అయితే ఆయన టిడిపిలోకి వెళతారా? లేదా? అనేది బహిర్గతం కాలేదు. శ్రీకృష్ణదేవరాయులు బాటలోనే జంగా పయనిస్తారని వైసిపి వర్గాల్లో ప్రచారమవుతోంది.

పొన్నూరులో ఎమ్మెల్యే రోశయ్య మార్చాలని ప్రయత్నించినా టిడిపికి దీటైన అభ్యర్థి దొరకలేదు. దీంతో అనివార్యంగా రోశయ్యను కొనసాగిస్తున్నారని

▶ 2లో



నరసరావుపేటలో సమ్మె శిబిరం వద్ద విజయోత్సవ సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

ఈ పోరాటం చారిత్రాత్మకం

అంగన్వాడీల సమ్మె విజయోత్సవ సభల్లో నాయకులు

42 రోజుల అనంతరం సమ్మె విరమణ - విధుల్లోకి అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఇన్ని రోజులు కొనసాగిస్తుందని ఎవరు ఊహించలేదని, ఇన్ని రోజులు అంగన్వాడీలు ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులను తట్టుకుని ఎంతో పట్టుదలతో పోరాడారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అభినందనలు తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సమ్మె శిబిరం వద్ద మంగళవారం నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 42 రోజులపాటు కొనసాగిన సమ్మెకు అండగా ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో కృషి చేసిన మీడియా ప్రతినిధులకు అంగన్వాడీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. విజయోత్సవ సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి. మెటిల్డాదేవి అధ్యక్షత వహించగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి రోజుల్లో లేని ఆనందం అంగన్వాడీలకు ఇప్పుడొచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో హామీల అమలు, ఉద్యోగ భద్రత, మరింత మెరుగైన వేతనాల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి మాట్లాడుతూ పోరాటం వల్లే ప్రస్తుత విజయం సాధ్యమైందన్నారు. నిరవధిక దీక్షలకు కూర్చున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ, అధ్యక్షులు బేబీ రాణితోపాటు అండగా నిలిచిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇచ్చిన

▶ 2లో



2 లో

మంగళగిరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు తదితరులు

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు



గుంటూరు పీడీ కార్యాలయంలో లేఖ అందచేస్తున్న యూనియన్ నాయకులు

ఈ పోరాటం చారిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

హామీ మేరకు జూన్ నుండి వేతనాలు పెంపు తదితర డిమాండ్లపై అవసరమైతే ఆయా ప్రభుత్వాలను ఎదిరిస్తూ ఇదే తరహా ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ప్రాజెక్టు లీడర్ బి.నిర్మల, డి.మాధవి, బివి రమణ,శోభారాణి, సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకులు ఏడుకొండలు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, సిపిఎం నాయకులు బి.నాగేశ్వరరావు, ఎమ్‌డి హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వంతో చర్చలు సఫలం కావటంతో అంగన్‌వాడీలు సమ్మె విరమించారు. ఈ మేరకు 23వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు విధుల్లో చేరుతున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీకి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు, అంగన్‌వాడీలు మంగళవారం ఆ శాఖ కార్యాలయంలో కలిసి లేఖ అందచేశారు. తొలుత అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట 42 రోజులపాటు సమ్మె కొనసాగిన శిబిరాన్ని సందర్శించి ఒకరికొకరు అభినందనలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ అనేక రకాల ఒత్తిళ్లను తట్టుకొని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాడిన అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు అండగా నిలిచిన రాజకీయ పక్షాలు, కార్మిక, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే జిఒల రూపంలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ, నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్న వెంకాయమ్మ, టి.రాధ పాల్గొన్నారు.

వైసిపికి రాజీనామాల సెగ!

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వర్గాల్లో ప్రచారమవుతోంది. పొన్నూరు నుంచి పోటీకి పలువురు సీనియర్లను ప్రతిపాదించినా వారు అంగీకరించ లేదు. సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ప్రకటించిన ఎమ్మెల్యే ముస్తాఫా కుమార్తెకు కూడా అసమ్మతి సెగ తగిలింది. ఆమెకు వ్యతిరేకంగా డిప్యూటీ మేయర్ సజీల, ఆమె తండ్రి షౌకత్, ఇతర నాయకులు కలిసి భేటి అయ్యారు. తూర్పు నియోజకవర్గంలో వైసిపిలోని సీనియర్లు ఎంత వరకు సహకరిస్తారన్నదీ చర్చనీయాంశంగా మారింది. ప్రత్తిపాడులో సమన్వయకర్తగా నియమితులైనా బలసాని కిరణ్‌తో కూడా నాయకులు మమేకం కాలేకపోతున్నారు. ఆయన కూడా నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి సారించలేదు. చిలకలూరిపేటలో మల్లెల రాజేష్ నాయుడుకు కూడా ప్రస్తుతం ఒంటరి పోరాటం చేస్తున్నారు.

ప్రత్తిపాడు, చిలకలూరిపేటలో అభ్యర్థుల ఎంపికపై వైసిపి ఐప్యాక్ ద్వారా రీ సర్వే చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రత్తిపాడులో మాజీ మంత్రి రావెలకిషోర్‌ను ఎంపిక చేస్తారని తెలిసింది. ఆయన రెండురోజుల్లో వైసిపిలో చేరతారని సమాచారం. టిడిపి బాగా పట్టున్న చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి పుల్లారావును ఎదుర్కొంనేందుకు మల్లెల రాజేష్ సరితూగగలరా లేదా? అని ఐ ప్యాక్ మళ్లీ సర్వే చేస్తున్నట్టు తెలిసింది. గతంలో ఆయనకు పుల్లారావుతో ఉన్న సాన్నిహిత్యం వల్ల కొంత మంది వైసిపి నాయకులు అంటీముట్టనట్టు వుంటున్నారు. గుంటూరు ఎంపిగా మరోసారి మోదుగుల వేణుగోపాలరెడ్డికి లేదా సినీనటుడు ఆలీకి అవకాశం ఇవ్వాలని అధిష్టానం యోచిస్తోంది. అంబటి రాయుడు అర్ధాంతర నిష్క్రమణతో వైసిపికి ఎంపి అభ్యర్థుల దొరకడం కష్టంగా మారింది. నర్సరావుపేట, గుంటూరు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల వేటలో వైసిపి నాయకత్వం తలమునకలైంది.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు



ఎన్నారై కాలేజీలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి

స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పాత మంగళగిరిలో గల నేతాజీ విగ్రహానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి, నాయకులు బి.నర్సయ్య, కె.ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి జనసేన పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంటిఎంసి అధ్యక్షులు ఎం.వెంకట మారుతిరావు, నాయకులు బి.కోమలి, షేక్ సుభాని, ఎస్.నాగేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, జి.మధు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ కలకత్తా మేయర్‌గానూ పనిచేసిన చంద్రబోస్ ఐసిఎస్, ఐఎఎస్ ఉద్యోగాలను తృణప్రాయంగా విడిచిపెట్టి ఆజాద్ హిందూ ఫౌజ్ అనే సంస్థను ప్రారంభించి దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరిరావు, ఏఓ బి.సీతారామయ్య, వివిధ విభాగాల అధిపతులు రెహమాన్, రవికుమార్, కెఎస్ఆర్, చంద్రమౌళి, కోటేశ్వరరావు, జగన్నాథరావు, రాము అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక రైలుపేటలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి స్థానిక టీ కొట్టు నిర్వాహకులు బుస్సా ప్రసాద్ మంగళవారం పూలమాలేసి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు. 15 ఏళ్ల నుండి క్రమం తప్పకుండా ప్రసాద్ ఇలా ఉత్సవాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

స్థానిక శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం ఆనందరావు పూలమాలలేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

నేతాజీ సేవా దళం ఆధ్వర్యంలో తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్‌లో నేతాజీ 127వ జయంతి నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి సేవా దళం గౌరవాధ్యక్షులు చింతా శ్రీరామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నిర్ణయించి ఉద్యమంలోకి ఉరికిన దేశ భక్తుడు నేతాజీ అని కొనియాడారు. విశ్రాంత సైనికోద్యోగి జి.సాంబశివరావు, వైసిపి నాయకులు ఎం.అంజిరెడ్డి, యు.కల్యాణ్‌కుమార్, ఎస్.గంగాధరరావు, ఎమ్‌డి గోరెబాబు, ఎమ్‌డి బాబ్జీ, అంజి, ఎమ్‌డి సర్దార్, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంఇఒ-2 పి.జాకబ్ అన్నారు. స్థానిక అశోక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించగా చిత్రపటానికి జాకబ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు :

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు వేడుకలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా తాడేపల్లి రూరల్ ఇప్పటం గ్రామ టిడిపి అధ్యక్షులు శంకర్ శెట్టి పిచ్చయ్య సంయుక్త సహకారంతో 20 మందికి కుట్టు మిషన్లు, 3 రిక్షా బండ్లు, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 8 మందికి రూ.80 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ముందుగా కేక్ కట్ చేసి టీడీపి, జనసేన,నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడారు. నియోజకవర్గంలో 23 రకాల సంక్షేమ పథకాలు పేద ప్రజలు స్వయం శక్తిగా వాళ్ళకి ఉపాధి పనిముట్లను లోకేష్ అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, నాయకులు జె.రత్తయ్య, జె.మహేంద్ర, జె.రాంబాబు, ఎస్.చంద్రశేఖర్, టి.కొండలరావు, వి.జోష్న, కె.నాగేశ్వరరావు, ఎల్.నరసింహారావు పాల్గొన్నారు. వడ్డేశ్వరం యానాది కాలనీలో 30 మంది పేద కుటుంబాలకు బియ్యాన్ని టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో అందజేశారు. 40 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నూతన వస్త్రాలు అందజేశారు. 300 మందికి అన్నదానం చేశారు. అమరా సుబ్బారావు, కె.శేషు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఇ.బాబు, ఎం.సుబ్రహ్మణ్యం, బి.కృష్ణ వందన, జి.రంగారావు, వి.అబ్రహం, కె.కోటేశ్వరరావు, వి.బీముడు, కె.సాంబశివరావు, రాజారావు పాల్గొన్నారు. కుంచనపల్లి టిడిపి మండల కార్యాలయంలో కేకును టిడిపి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కె.శేషు, ఎస్.నాగేశ్వరరావు, ఎం.రాజా, కె.కోటేశ్వరరావు, బి.రమేష్, డి.జ్యోతి బసు, పి.ఖాసింఖాన్, డి.అరుణ, వి.శ్రీనివాసరావు, షేక్ నాగూర్‌వలి, కె.మహేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. తాడేపల్లిలోని టిడిపి కార్యాలయం, సంజీవని ఆస్పత్రి, శ్రీశక్తి కార్యాలయం, బైపాస్‌రోడ్డు నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, అరుణకుమారి, వేణుగోపాలరెడ్డి, నాగేశ్వరరావు, ఎస్.కిరణ్, డి.దాసు పాల్గొన్నారు. పెనుమాకలో టిడిపి మండల కార్యదర్శి కొల్లి శేషు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, వీరేంద్రనాథ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉండవల్లి కరకట్ట వెంబడి చిగురు అనాథ ఆశ్రమంలో గుంటూరు కళ్లం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొమ్మారెడ్డి కిరణ్, కళ్లం గోవింద్ రెడ్డి, జంగాల వెంకటేష్, కాశింఖాన్, కళ్లం చేతన్‌రెడ్డి, కొల్లి సురేష్, మేకా హనుమారెడ్డి పాల్గొన్నారు. తుళ్లూరులో భారీ ర్యాలీ చేశారు. గుంటూరులో టిడిపి గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మహమ్మద్ నసీర్, కోవెలమూడి రవీంద్ర (నానీ) ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు చేశారు. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మంగళగిరిలోని శ్రీ కృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం చేయగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. షరాబ్ బజార్లో లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో, పాత బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేశారు.



ఇప్పటం



వడ్డేశ్వరం



కుంచనపల్లి



పెనుమాక



తాడేపల్లి

పల్నాడుకు ఎంతో చేశా



- ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు
- పదవికి, వైసిపికి రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా అభివృద్ధికి కోసం గత ఐదేళ్లలో తాను ఎంతో కృషి చేశానని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందరు ఎంపీల మాదిరిగా వ్యాపారాలు చేసుకుంటూ, అందుబాటులో లేకుండా పోలేదన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. పల్నాడుని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చాలని పరితపించానని, సిఎం జగన్ తనకు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా తాను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాధించానని చెప్పారు. శంకుస్థాపనలకే పరిమితమైన వరికెపూడిసెల ప్రాజెక్టుకు అటవీ అనుమతులను సాధించి నిర్మాణంలో పురోగతిని సాధించామన్నారు. మెరుగైన వైద్యం కోసం అల్లాడుతున్న పల్నాడు ప్రజానీకానికి సూపర్ స్పెషాలిటీ సేవలు అందేలా, మెడికల్ విద్య అందేలా పల్నాడులో మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నారని తెలిపారు. మాచర్ల, రొంపిచర్లలో కొత్తగా రెండు కేంద్రియ విద్యాలయాలను మంజూరు చేయించినట్టు తెలిపారు. దాదాపు రూ.3000 కోట్లతో జాతీయ రహదారులు సాధించానని, 30 నిమిషాల్లోనే ప్రజలు హైవే పైకి చేరుకునేలా పల్నాడులో రహదారులు వచ్చాయని అన్నారు. వ్యవసాయాధారితమైన పల్నాడులో రైతులకు మేలు జరిగేలా ఇండో - ఇజ్రాయిల్ ప్రాజెక్టు సాధించానని, ఇటీవలే శంకుస్థాపన చేశామని చెప్పారు. జెఎన్‌టియు నర్సరావుపేట కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించుకుని కళాశాలకు కొత్త కళ తీసుకొచ్చామని చెప్పారు. పొలాలకు, డొంకలకు వెళ్లే మార్గాలను సొంత నిధులతో బాగుచేయించినట్లు చెప్పారు. అయితే కొన్ని రోజులుగా తన సీటు విషయంలో అనిశ్చితి నెలకొందని, అటు నాయకులు, ప్రజలు, క్యాడర్ గందరగోళ వాతావరణంలోకి వెళ్లారని చెప్పారు. దీని వల్ల అటు నాయకులకు, పార్టీకి, తనకి ఎవరికీ ఉపయోగం లేదని, వీటన్నిటికీ తెరదించుతూ తన పదవికి, వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాను ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి విడదల రజనీ తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 33వ వార్డు లక్ష్మీపురం ప్రధాన రహదారి నాయర్ హోటల్ సెంటర్ నుంచి మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని మరోసారి గెలిపించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో న్యూస్‌రీడర్ దుర్మరణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు-చిలకలూరిపేట జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక సిటీ కేబుల్ న్యూస్ రీడర్ బత్తిన అశోక్‌కుమార్ (26) దుర్మరణం పాలయ్యాడు. వార్తల చదవడం ముగించుకుని స్వగ్రామం దాసరిపాలెం వెళ్తుండగా పొత్తూరుకు సమీపంలోని వినాయకగుడి వద్ద ఎదురుగా లారీ ఢీకొంది. ముఖం అంతా ఛిద్రమైంది. హిందూ కళాశాలలో పిజి చదివిన అశోక్ గత కొంత కాలంగా ఉద్యోగ వేటలో ఉన్నారు. ఇటీవల గుంటూరు సిటీ కేబుల్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృత దేహాన్ని రుద్రచారిటబుల్ ట్రస్టు వారు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అధికారులతో కలసి పరిశీలిస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

తాగునీటి చెరువులకు సాగర్ జలాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణానికి తాగునీటి చెరువుకు సాగర్ జలాలు చేరు తున్నాయి. బుధవా రం నాడు పేట10 ఆర్ మేజరు ద్వా రా కోటప్పకొండ ఆఫ్ టేక్ ఛాంబర్ నుంచి నేరుగా కొత్త చెరువుకు, సమీ పంలోని ఆఫ్ టేక్ ఛాంబర్ ద్వారా పా త చెరువుకు చేరుతున్నాయి. ఈ సందర్భంగా అధికారులతో పాటు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు బుధవారం ఎన్ ఎస్.పి.అధికారులు, మునిసిపల్ అధికారులు, పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. రెండు రోజులు మాత్రమే నీటి విడుదల కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో ర్యాపిడ్ ఫిల్లింగ్ తోపాటు కాల్వపై కాపలా పెంచి తాగునీటి అవసరాలకు వదిలిన నీరు దుర్వినియోగం కాకుండా చూసి చెరువుల్లోకి సాగర్ జలాలు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆయన కోరారు. పోలీసు, ఎన్ ఎస్ స్పీ, మునిసిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులు నింపడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ పి ఈఈ మల్లికార్జునరావు, డీఈ ఉమాశంకర్, ఏఈ బొంగు శ్రీనివాసరావు, మునిసిపల్ ఏఈ శ్రీనివాసరావు, ఎనెస్పీ వర్క్ ఇన్ స్పెక్టర్ లు నాగరాజు, మహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు విడదల హరనాధసింగారెడ్డి కోటిరెడ్డి, పంగులూరి వెంగళరాయుడు, సాతులూరి రవి, వట్టెం శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు

అంగన్వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించండి

పీడీని కోరిన యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పరిధిలో ఉన్న అంగన్వాడీల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డా దేవి, గుంటూరు మల్లేశ్వరిలు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణి ని కోరారు. కొన్ని నెలలుగా డిప్యూటేషన్ లో ఉన్న పిడి ఉమారాణి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. 42 రోజులుగా సమ్మెలో ఉన్న నేపథ్యంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమస్యలు పరిష్కారం కోసం సంకల్ప దీక్షతో పోరాటం చేసిన అంగన్వాడీల పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చిన నేపథ్యంలో అంగన్వాడీ ల అంకితభావంతో పని చేయాలని లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి, ప్రాజెక్ట్ లీడర్లు శోభారాణి, బి నిర్మల ,బివి రమణ, డి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు చొరవతో వైద్యానికి రూ .3 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పిడుగురాళ్లకు చెందిన 18 ఏళ్ళ యువకుడు బిందు సాయి సుమంత్ కు ప్రధాన మంత్రి సహాయనిది రూ 3 లక్షలు నగదు నరసరావుపేట ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం నరసరావుపేట పట్టణంలోని ఎన్.జి.ఓ కాలనీ లోని పార్లమెంట్ కార్యాలయంలో బాధితునికి చెక్కు అందజేశారు. కేన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకునే ఆర్థిక పరిస్థితి సహకరించక సాయం కోరగా స్పందించిన ఎంపి నిధులు మంజూరు చేయించారు. బాధితునికి భవిష్యత్తులో అండగా ఉంటానని ఎంపి హామీ ఇచ్చారు. చికిత్స కోసం నిధులు సమకూర్చిన ఎంపికి బాధితుడు అతని కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈపూరులో పంటల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

ప్రకృతి వ్యవసాయంతో ప్రకృతి వైపరీత్యాలను అధిగమించవచ్చని పల్నాడు జిల్లా డిపిఎం కె అమల కుమారి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో మహిళా రైతు మద్దం ఆదిలక్ష్మి సాగుచేసిన (డిఆర్పీఎమ్ మోడల్స్) వర్షాభావ పరి స్థితులను తట్టుకొనే కంది, ఆముదం, పంటలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ పంటలలో అంతర పంటలుగా సాగు చేసిన సజ్జ, చిక్కుడు, అనుములు,సొర, దోస సాగు తీరు ఆదాయంపై మహిళా రైతులతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు వర్షాభావ పరిస్థితుల వలన భూమిని ఖాళీగా ఉంచకుండా ఈ విధానం అవలంబించడం ద్వారా రైతుకు ఆదాయం లభించడంతోపాటు భూమి సారమంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డి ఎల్ ఐటి శివాజీ, ఎన్ ఎఫ్ ఏ సైదయ్య,మోడల్ మేకర్స్ ప్రకాష్ రావు, భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న డిపిఎం కె.అమల కుమారి

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ప్రజాశక్తి-తెనాలి

నూతన సంవత్సర వేడుకలలో భాగంగా డాన్స్ చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన యువకుడు చికిత్స పొందుతూ మతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో జనవరి ఒకటిన కొత్త సంవత్సర వేడుకలకు సంబంధించి ప్రత్యేకంగా స్టేజ్ ఏర్పాటు చేశారు. ఆ స్టేజ్ పై అదే కాలనీకి చెందిన యువకుడు సంతోష్ (19) డాన్స్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయమైనా పట్టించుకోలేదు. నాలుగు రోజుల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో, కుటుంబ సభ్యులు అతనిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి సంతోష్ మతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం 31 వ వార్డు కనకదుర్గ గుడి దగ్గరలో నివాసం ఉంటున్న అరేపల్లి మునీ స్వర రావు అను అతను గుం టూరు రోడ్డు లో గల దర్గా దగ్గరలో మంగళ వారం అక్రమ మద్యం కలిగి ఉన్నట్లు వచ్చిన సమాచారంతో అర్బన్ యస్ ఐ షేక్ .హాషీమ్ సమాచారం తెలుసుకొని సిబ్బం దితో కలిసి అతని వద్ద నుండి 8 మద్యం బాటిల్స్ లను స్వాదిన పర్చుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హాసీన్ తెలిపారు .

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపు లోకి తీసుకుని, అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్ల డించిన వివరాల ప్రకారం రూరల్ పరిధిలోని గుడివాడ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ, అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న టి. శ్యాం బాబును అదుపులోకి తీసుకొని, అతని నుంచి 12 క్వార్టర్ల మద్యం సీతాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

'లిటిల్ సిస్టర్స్' నిర్వాహకులకు సైమన్ అవార్డు

ప్రజాశక్తి-మంగళగిరి



సేవా రంగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రతీ ఏటా శాంతి దూత మినిస్ట్రీస్ వారు అందించే సైమన్ అవార్డ్ - 2023 ను మంగళ వారం జాతీయ రహదారి ప్రక్కనే పెద కాకాని లో ఉన్న వృద్ధాశ్రమం నిర్వాహకులు లిటిల్ సిస్టర్స్ సంస్థ నిర్వాహకులకు అందించారు వృద్ధాశ్రమం ఇంఛార్జి సిస్టర్ జుడిత్ అవార్డ్ ను అందుకున్నారు. కార్యక్రమం లో మినిస్ట్రీస్ ట్రస్ట్ అధ్యక్షులు కె.రూఫస్, ప్రముఖ సీరియల్ రైటర్ రవి కొలికపూడి, పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జోసెఫ్ కొదమల, కే కే రవి కుమార్, పి.తిమోతి, బెల్లంకొండ శివాజీ రాజు, ట్రస్ట్ ప్రతినిధులు కె.కవిత, కే. మాధురి, జే. నయోమి నిశ్చల, తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 124,670
మిర్చి ఎగుమతి	: 115,444
మిర్చి నిల్వ	: 62,019

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 20,000
నెం.5	9,000 - 18,000
273	11,500 - 18,000
341	9,000 - 19,800
4884	9,000 - 17,000
సూపర్ 10	9,000 -13,500
	నాన్ ఎసి
తేజ	8,000 - 20,500
బడిగి	9,800 - 20,000
దేవనూరు డీలక్స్	9,000 - 19,000
తాలుకాయలు	5,000 - 13,000

సరికొండ రమాదేవికి అవార్డులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సత్తెనపల్లి కి చెందిన సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవికి డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి జాతీయ సాహిత్య సేవారత్న మరియు నేషనల్ ఎంబ్లెమ్ ఆఫ్ ఇండియా అవార్డులు ప్రధానం చేశారు.లిటిల్ ఛాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా వారి ఆద్వర్యంలో ఈనెల 22 న ఒంగోలులోని శర్మ కాలేజి ఆవరణలో సత్తెనపల్లి కి చెందిన రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవిని లిటిల్ ఛాంప్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఐన కె బుచ్చేశ్వరరావు మరియు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ అధికారి ఐన కొలకలూరి రవిబాబు శివ సాయి నాట్య గురువు కొప్పోలు పావని చేతుల మీదుగా డాక్టరువై.యస్ రాజశేఖర రెడ్డి జాతీయ సాహిత్య సేవారత్న అవార్డ్, నేషనల్ ఎంబ్లమ్ ఆఫ్ ఇండియా గుర్తు గల అవార్డ్, సర్టిఫికెట్స్ ఆఫ్ ఎక్సెలెన్స్ మొమెంట్‌తో ఆమెను సత్కరించారు. ఈ సందర్భముగా డాక్టర్ సరికొండ రమాదేవి ని సత్తెనపల్లి లోని వివిధ సంస్థల అధినేతలు, కార్యదర్శులు, అభినందించారు.

విన్సెంట్ పాల్‌కు సాహిత్య రత్న పురస్కారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణానికి చెందిన సామాజిక వేత్త చుక్కా విన్సెంట్ పాల్ కు ఒంగోలుకి చెందిన లిటిల్స్ ఛాంప్స్ అకడమీఆఫ్ ఇండియా,డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్య రత్న పురస్కారాన్ని మంగళవారం అందచేశారు. యీ పురస్కారం పొందటం పట్ల విన్సెంట్ పాల్ ను స్థానిక బి.ఎస్.ఎం.ఎల్.రిటైర్డు అధికారి ఎ.వి. శివయ్య,ఫెంక్షన్ ర్ల అసోషియోషన్ పట్టణా ధ్యక్షులు లంక ఆదినారాయణ రెడ్డి, వై. ఎమ్.సి.ఎ చిలకలూరిపేట శాఖ అధ్యక్షులు కె. రామ మోహన్ రావు, కార్యదర్శి పులిపాటి కెనడీ, ఎమ్ ప్రసన్న కుమార్ డాక్టర్ డి సి హెచ్ కాటయ్య, జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జి బాబు, పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న సామాజిక వేత్త చుక్కా విన్సెంట్ పాల్



కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పరీక్ష పే చర్చలో భాగంగా కేంద్రీయ విద్యాలయం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాంశాలలకు చెందిన 100 మంది విద్యార్థినీ విద్యార్థుల పాలొన్నారు. చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా ,వికసిత్ భారత్ , నేతాజీ సుభాష్ చంద్రబోస్ ,ఆదిత్య ఎల్-1 అనే అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఆర్.పార్ధవి, రెండో బహుమతి ఎం.హాసిని, మూడో బహుమతి మెహాత,నాల్గవ బహుమతి దేవీ భవ్య, ఐదోవ బహుమతి శృతి గెలుపొందారు. చిత్ర లేఖన పోటీల్లో గెలుపొందిన ఉత్తమ 10 చిత్రాలను న్యూ ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు పంపనున్నట్లుకేంద్రీయ విద్యాలయ, సత్తెనపల్లి ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం.పద్మావతి తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్ వి ఎస్ సి వి ఎస్ హై స్కూల్‌లో ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, డ్రాయింగ్, కాంపిటేషన్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో మొదటి బహుమతి గణపవరం జడ్పీహెచ్ఎస్‌కి, ద్వితీయ బహుమతి చిరుమామిళ్ల జడ్పీహెచ్ఎస్ గెలుపొందాయి. డ్రాయింగ్ లో మొదటి బహుమతి బొప్పూడి జిల్లా ప రిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భారతి, ద్వితీయ బహుమతిచిలకలూరిపేట మాస్టర్ మైండ్స్ ఇంగ్లీ ష్ మీడియం స్కూల్ విద్యార్థిని సిహెచ్ సంజన గెలుపొందారు. వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతి బొప్పూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని జి.మౌనికకి, ద్వితీయ బహుమతి కావూరులోని గాయత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థిని ఎం.హేమ, చిలక లూరి పేట స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతిగణపవ రంజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ షహీనా బేగం , ద్వితీయ బహుమతి చిరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి. అనూషకు దక్కాయి. కార్యక్రమంలో విద్యాశాఖ అధి కారి లక్ష్మీ ,ఆర్ వి ఎస్ సి వి ఎస్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, మహబూబ్ సుభాని, తోట శివకుమార్, వివిధ పాఠ శాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక, నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిరపతోటలు సాగు చేస్తున్న రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బిజె బెన్ని అన్నారు .బొల్లాపల్లి మండలంలోని వడ్డెంగుంటలో జిల్లా ఉద్యాన ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు మిరప సాగులో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.అఖిల భారత ఉద్యాన పరిశోధన కేంద్రం బెంగళూరు డాక్టర్ మాధవి రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ పి. నరేష్, డాక్టర్ అచేర్ కుల్ల శాస్త్రవేత్తల బృందం రైతులకు సలహాలు,సూచనలు చేశారు.

సమ్మె విరమించి సంబరాలు

ప్రజాశక్తి-క్రోసూరు

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయనిసిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు అన్నారు. అంగన్వాడి సమ్మె జయప్రదం అయిన నేపథ్యంలో క్రోసూరు లోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు మంగళవార ం సంతోషం వ్యక్తం చేశారు. సిఐటియు జెండాలు చేతబూని ఉత్సాహంతో వారు నృత్యం చేశారు. టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా అంగన్వాడీల సమస్యలపై చర్చించటానికి అవకాశం ఇవ్వని ప్రభుత్వాన్ని, జీతాలు పెంచుతామని లిఖిత పూర్వకమైన హామీ పొంది, ఇతర సమస్యల పరిష్కారం చేస్తామని ప్రకటించే విధంగా అంగన్వాడీల నిరవధిక సమ్మె చేసిందని అన్నారు. సిఐటియు నాయకత్వం లోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మీద నమ్మకంతో సమరశీలమైన ఉద్యమంలో అంగన్వాడీలు నిలబడటం వలన ప్రభుత్వం దిగి రావాల్సి వచ్చిందని అన్నారు.అంగన్వాడీలకు సిఐటియు జేజేలు పలుకుతోందని అన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు క్రోసూర్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి బి.జయలక్ష్మి మాట్లాడుతూ యూనియన్‌పై నమ్మకంతో వ్యక్తిగతంగా ఎన్ని ఒత్తిడిలు వచ్చినప్పటికీ నిలబడినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ క్రోసూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జి.శివపార్వతి,నాయకులు ఈ మెరీనా, భూలక్ష్మి, విజయలక్ష్మి, ఎం విజయ కుమారి,ఆషా,శోభ, వెంకాయమ్మ , సిహెచ్ విజయనిర్మల, ఎ.మంగమ్మ, ధనలక్ష్మి, దానమ్మ, శ్రీలక్ష్మి, రహీమున్నీసా, నిర్మల పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంగన్వాడీల సమ్మె విజయవంతం కావడంతో వారు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పండరీపురం రెండవ లైన్‌లోని సిఐటియు కార్యాలయంలో అంగన్వాడి వర్కర్లు అండ్ హెల్పర్లు (సిఐటియు) యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్ చేశారు. సమ్మె అనంతరం సాధించుకున్న 11 డిమాండ్ల కోసం నిరంతరం పోరాడిన వారిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి 11 డిమాండ్లను ఆమోదించి నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనేక బెదిరింపులకు బెదరక, ఒత్తిళ్లకు తలొగ్గక,ఆర్థికంగా సర్దుబాటు చేసుకుంటూ సహనంతో ఉద్యమానికి పూర్తిగా సహకరించిన ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్తకు, టీచర్లకు, ఆయాలకు, సెక్టార్ లీడర్లకు ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు జి.సావిత్రి,సెక్టార్ లీడర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి యడ్లపాడు నాయకులు పీటర్ విప్లవ గీతాలు పాడి ఉత్సాహపరిచారు. అనంతరం సిఐటియు, యూటిఎఫ్ నాయకులు ప్రసంగిం చారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షు లు వై రాధాకృష్ణ రైతు సంఘం డివిజన్ కార్యదర్శి బి.శంకరరావు, సిఐటియు కార్యదర్శి టి.కోటేశ్వర రావు, కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు రోశయ్య, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి, పల్నాడు జిల్లా తిరుపతి స్వామి, కెవిపిఎస్ పల్నాడు జిల్లా స హాయ కార్యదర్శి ఎం.విల్సన్ రైతు సంఘం యడ్లపాడు నాయకులు ఎ. సుబ్బారావు, ఎస్.బాబు,టి.ప్రతాప్‌రెడ్డి పి. గోపి, అంగన్వాడీలు టీచర్లు, సెక్టార్ లీడర్లు రమాదేవి, ఎ.పద్మావతి, రాజేశ్వరి,గౌరీ, నాగలక్ష్మి,రాధా,సుబ్బాయమ్మ వెంకాయమ్మ, మాధవి,రత్నకుమారి, పరిమళ, రజిని, రాణి తదితరులు పాల్గొన్నారు. సిఐటియు మండల కన్వీనర్మ పేరు బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ జరిపిన పోరాటం ఎన్నో కార్మిక సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సాధారణ మహిళలు ఆసాధారణ ఉద్యమం చేపట్టారని ప్రశంసించారు. ఐకమత్యంతో పోరాటం చేస్తే సమస్యలను పరిష్కరించుకోగలమని మరోసారి రుజువైందనిఅన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటరత్నం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఉషారాణి, ఇందిర, కె.పద్మావతి, కోటేశ్వరి, సుందర లీల, శారద, దుర్గా శివలక్ష్మి, రుక్మిణి, జయ లక్ష్మి, శివపార్వతి, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.



చిలకలూరిపేటలోని సిఐటియు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



క్రోసూరులో నృత్యం చేస్తున్న అంగన్వాడీలు



అమరావతిలో విజయోత్సవ సభలో అంగన్వాడీలు



మాచర్లలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బండ్ల మహేష్

ప్రజాశక్తి - మాచర్ల

సమస్యల సాధన కోసం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు చేసిన పోరాటం చారిత్రాత్మకమైందని సిఐటియు నాయకులు బండ్ల మహేష్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై ప్రభుత్వానికి, సంఘ నాయకులకు మధ్య చర్చలు ఫలించి సమ్మె విరమించిన నేపథ్యంలో స్థానికి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలను ఉద్దేశించి ఆయన మాటాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విజయం అందరి ఐక్యత కృషి వల్ల సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చేసిన వారికి,మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలు, అఖిల పక్షాల వారికి,ప్రజా సంఘాల కు, ఉపాధ్యాయులకు, దళిత గిరిజన సంఘాల వారికి జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుచ్చిబాబు ధన్యవాదాలు తెలిపారు..

ప్రజాశక్తి-అమరావతి

కార్మిక వర్గ పోరాట స్ఫూర్తిని చారిత్రాత్మకంగా ఆంధ్రప్రదేశ్ లో అంగన్వాడి ఉద్యమం చిరస్థాయిగా నిలు స్తుందని సిఐటియు మండల కార్యదర్శి బి. సూరిబాబు అన్నారు. విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా హక్కులు సాధించుకోవడంలో ఐక్యత కనబరిచిన అంగన్వాడీలకు సిఐ టియు అభినందనలు తెలియజేస్తోందని అన్నారు.



యుటిఎఫ్ పాకెట్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దాచేపల్లి :

మండలంలోని ఉద్యోగులు ఉపాధ్యాయుల వివరాలు ఫోన్ నెంబర్లతో కూడిన యుటిఎఫ్ ప్యాకెట్ బుక్ ను డాక్టర్ కృష్ణ ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. నడికుడి రైల్వే స్టేషన్ రోడ్ లోని కృష్ణ హాస్పిటల్‌లో మంగళవారం ఈ సందర్భంగా ఓ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ ప్రసాద్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలి పారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి నాగేశ్వరరావు, మండల గౌరవాధ్యక్షులు ఎన్ ఏసయ్య, సహాధ్యక్షులు నాగుల్ మీరా,సీనియర్ నాయకులు శాంతారావు, చాన్ బాషా, మస్తాన్ వలి, ఎన్వి రాంబాబు, వాసుదేవరావు సాయి బాబా, సుధాకర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర రావు, వేణుగోపాల్, రమేష్ మాణిక్యరావులు పాల్గొన్నారు.



కనపర్రులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాదెండ్ల : కనపర్రులో విష జ్వరాలు ఉండటంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 63 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో తిరుణాల సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.గ్రామ మొత్తం తిరిగి మలేరియా కేసులు ఏమైనా ఉన్నాయా అని విచారించారు. జిల్లా అధికారి రవీంద్ర రత్నాకర్, సూపర్‌వైజర్లు శివశంకర్, శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రత్నబాబు, నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి కాంతారావు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
బుధవారం 24 జనవరి 2024


గుంటూరు


తాడేపల్లి

సమ్మె శిబిరాల వద్ద విజయోత్సవాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

చావనైనా చస్తాంగానీ ఉద్యమ జెండాను వదలబోమని అంగన్‌వాడీలు ఉద్ఘాటించారు. అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో వారు సమ్మెను విరమించి మంగళవారం దీక్షా శిబిరాల వద్ద విజయోత్సవ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా తాడేపల్లి శిబిరం వద్ద కేక్‌ను కట్ చేయడంతోపాటు టపాసులు పేల్చారు. సభలో పలువురు అంగన్వాడీలు మాట్లాడుతూ ఉద్యోగం పోతుందని, పని చేసే సెంటర్‌కు వెళ్లాలని అందరూ ఒత్తిడి చేశారని, అయితే అలా ఒత్తిడి చేసి నన్ను ఉద్యోగానికి పంపిస్తే మా చావుకు మీరే కారణం అని కుటుంబ సభ్యులను ఎదిరించి సమ్మె శిబిరానికి వచ్చానని ఓ అంగన్‌వాడీ చెప్పిన మాటలు అందరిలోనూ కొత్త స్ఫూర్తిని నింపాయి. పోలీసులు దుర్మార్గంగా కొడుతున్నా, లాఠీదెబ్బలు తింటున్నా పోరాటం నేర్పిన చైతన్యంతో వెనుదిరిగి చూడలేదని మరో అంగన్‌వాడీ అనుభవాలను చెప్పారు. ఉద్యోగం పోతుందని బెదిరింపులు ప్రతిరోజూ నిత్య కృత్యమైనా 42 రోజుల పాటు ఇల్లు, దీక్షా శిబిరం తప్ప ఉద్యోగం పోయినా ఫర్వాలేదనే విధంగా ఈ పోరాటం స్ఫూర్తి నింపిందని మరో అంగన్‌వాడీ తెలిపారు. ఉద్యమం జరిగిన తీరు తమను ఆకర్షించిందని, సిఐటియు జెండాను వీడమని సుజాత, కిరణ్మయి, శశిరాణి, కమల, కుమారి అన్నారు. సభకు కె.తబిత అధ్యక్షత వహించగా సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, టిఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, ఐద్వా, రైతు సంఘం, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి నాయకులు మాట్లాడారు. ఐక్య పోరాటాల ద్వారానే విజయం సాధ్యమని అంగన్‌వాడీ పోరాటం తెలియజేస్తుందని చెప్పారు. పెద్దఎత్తున సాగిన ఈ యుద్ధంలో అంగన్‌వాడీలు గెలిచారని ప్రశంసించారు. సభలో వి.దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, జె.శివశంకరరావు, డి.వెంకటరెడ్డి, డి.శ్రీనివాసకుమారి, పి.గిరిజ, కె.కరుణాకరరావు, డివి భాస్కరరెడ్డి, కె.మేరి, తులసమ్మ, కె.వెంకటయ్య, శంకర్, టి.వెంకటయ్య, ఎం.చెన్నయ్య, ప్రసాద్, డి.సామ్యేలు, రాజ్యలక్ష్మి, అరుణ, వరలక్ష్మి, మాణిక్యం, నాగలక్ష్మి, అమృత, రమణ, జసంత, వైదేహి, భవానీ, మరియమ్మ, కమల, కోటేశ్వరి, ఫాతిమ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక సుందరయ్య కాలనీలోని సిఐటియు కార్యాలయంలో ఇందువాణి అధ్యక్షతన విజయోత్సవ సభ జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అంగీకరించిన అంశాలపై వివరించారు. 11 డిమాండ్లలో 10 డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని, గడువు లోగా పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణ చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నన్నపనేని శివాజీ, యూనియన్ నాయకులు కె.రాజ్యలక్ష్మి,ప్రసన్న, కుమారి,సహజ, పావని పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సంఘటితంగా పోరాడ్డం వల్లే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు నాయకులు అన్నారు. అంబేద్కర్ సెంటర్లో గల సమ్మె శిబిరంలో స్వీట్లు పంచుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రసంగించారు. చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరల పోరాటాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, జెవి రాఘవులు, వై.కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, రైతు సంఘం నాయకులు ఎం.పకీరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.బాలాజీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ జానీబాష, అంగన్వాడీ యూనియన్ నాయకులు హేమలత, మేరీ రోజమ్మ, రుక్మిణి, సుహాసిని, స్వర్ణ, బేబీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక విఎస్ఆర్ కళాశాల ఎదురుగా తెనాలి విజయవాడ రహదారి వెంబడి సమ్మె శిబిరంలో విజయోసత్సవ సభ నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎవిఎన్ కుమారి, సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడారు. పోరాటానికి మద్దతు తెలిపిన కార్మిక సంఘాలకు, రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, అంగన్వాడి నాయకులు అనూరాధ, పి.పావని, హసీనా బేగం, నాగమణి, శాంతకుమారి పుష్ప, రజియా బేగం, పద్మ, కళాధరి, సుజాత, మాధవి, శ్రీలత, రాజకుమారి, రాధ, మల్లేశ్వరి, భాగ్యశ్రీ, లక్ష్మి, రత్న కుమారి, విజయ లక్ష్మి, సువర్ణ, పార్వతి, దేవి, జి సరోజిని, సూర్యకుమారి, జానకి, రాధిక, అరుణ కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక సమ్మె శిబిరంలో విజయోత్సవ సభ నిర్వహించారు. సభకు ముందుగా 38 రోజులపాటు క్రమం తప్పకుండా హాజరైన చిన్నారి షైనీ గ్రేస్‌తో కేక్‌ను కట్ చేయించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ 42 రోజులపాటు ఎంతో పట్టుదలతో సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ, ఆయా కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. సమ్మె శిపురాలకు మద్దతు తెలిపిన సంఘాలు, పార్టీలకు కృతజ్ఞతలు చెప్పారు. నాయకులు కె.విజయ, పి.రజిని, నందిని, సాగరిక, పద్మ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలో అంగన్వాడీల ఆందోళన కు మద్దతు తెలిపిన వారికి సిఐటియు రాజధాని డివిజన్ కమిటి అభినందనలు తెలిపింది. తుళ్లూరులోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు విజయోత్సవాన్ని జరిపారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజు మాట్లాడారు. పట్టు వదలకుండా అంగన్వాడీలు ఐక్యంగా పోరాడిన కారణంగా విజయం సాధించారని చెప్పారు. అన్ని పార్టీలు, సంఘాలు, మీడియా సంఘీభావంగా నిలిచాయని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నాయకులు పి.బాబురావు, జె.నవీన్ ప్రకాష్, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణలత, ఎస్‌కె కరీమున్, నాయకులు అన్నామణి, రజిని, విజయలక్ష్మి, తనూజ, శంషాద్, సునీత, సుచరిత, తులసి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

సమ్మె శిబిరంలో విజయోత్సవం నిర్వహించారు. తమకు సహకరించిన అందరికీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివపార్వతి శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వీట్స్ పంచుకున్నారు. రైతు సంఘ నాయకులు వెంకట శివరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.


పెదకాకాని


పెదనందిపాడు


ఫిరంగిపురం


తెనాలి


మంగళగిరి


డోకిపర్రులో జరుగుతున్న సర్వే

కొనసాగుతున్న కుల గణన సర్వే

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పలు గ్రామాల్లో కులగణన సర్వే విస్తృతంగా జరుగుతోంది. ఈ సర్వేల్లో ప్రధానంగా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల సహాయంతో ఇంటింటికి వెళ్లి ప్రజల నుండి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేను మండల స్థాయిలో నోడల్ ఆఫీసర్లు, గ్రామస్థాయిలో సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. మండలంలో అత్యధికంగా డోకుపర్రు సచివాలయం నందు అత్యధిక కుటుంబాలని సర్వే చేసినట్టుగా గణాంకాల ద్వారా తెలుస్తోంది. పేరేచర్ల, జంగంగుంటపాలెం తదితర గ్రామాల్లో సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. సర్వర్లు కొన్ని సందర్భాల్లో మోరాయిస్తున్నాయి.

బ్రెయిన్ డెడ్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తెనాలి పట్టణంలో 30వ వార్డు ఇందిరానగర్ కాలనీకి చెందిన తీన్మార్ వాయిద్య యువ కళాకారుడు ఉక్కుసూరి సంతోష్(19) బ్రెయిన్ డెడ్‌తో మంగళవారం మరణించారు. అంత్యక్రియల నిమిత్తం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రూ.5 వేలను అందించారు. టిడిపి నాయకులు టి.హరిప్రసాద్, పి.ప్రణీత్ తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నేడు 2కె రన్

ప్రజాశక్తి-తెనాలి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో 2కె రన్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.రవిబాబు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద 2కె రన్‌ను సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే 2కె రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చునన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి: వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత పంపిణీ బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, చైర్‌పర్సన్ టి.రాధిక, వైస్ చైర్మన్లు ఎం.హరిప్రసాద్, ఎ.నాగవేణి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు.

జొన్నలగడ్డలో కిరణ్‌కుమార్ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : బీసీల అభ్యున్నతికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలంలో జొన్నలగడ్డలో గుండె గుండెకు జగనన్న- గడప గడపకు కిరణన్న కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటిటికీ వెళ్లిన కిరణ్‌కుమార్... ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.





బంగారు తల్లి పథకం రెండో విడత ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆడపిల్లలు అన్ని రంగాల్లో మగవారికి ఏమాత్రం తీసిపోరని గవర్నమెంట్ హాస్పటల్ అభివద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. ఈమేరకు పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల ప్రకారం ఆడపిల్ల పుట్టగానే గవర్నమెంట్ హాస్పిటల్ సెలబ్రేట్ చేసి కేక్ కట్ చేసి ఫోటో ఫ్రేమ్ అందించడం పాటు వారి ఇంటి వద్ద కూడా బంగారు తల్లి రాక అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న వార్డు ప్రెసిడెంట్ మరియు ఊరు సర్పంచ్ , ఆశ వర్కులు ఏఎన్ఎం అందరితో కలిసి తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ దిగ్గానే బంగారు తల్లి పథకాన్ని అమలుపరిచే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దానిలో భాగంగా రెంటపాళ్ల లోని ఏటగిరి విజయలక్ష్మి, అనిల్ కు మూడో సంతానంగా అమ్మాయి పుట్టింది. ప్రసవం అనంతరం హాస్పిటల్ లో ఆడపిల్ల పుట్టినందుకు మంగళవారం బంగారు తల్లి పథకం అమలు పరిచి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్ సూపరింటెండెట్ లక్ష్మణరావు మాట్లాడుతూ బంగారు తల్లి పథకాన్ని కలెక్టర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని ,దానిలో సత్తెనపల్లిని ముఖ్యంగా ఎంచుకోవడం తాము అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ బంగారు తల్లి పథకం లో భాగంగా ఆడపిల్ల ఇంటి వద్దకు చేరగానే ఆమని ఆప్యాయంగా ఆహ్వానిస్తూ అక్కడ ఉన్న ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు,గ్రామ పెద్దలు సమక్షంలో పుటప్రేమ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ సుజాత, హాస్పటల్ అభివద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకష్ణ, రెంటపాళ్ల ప్రెసిడెంట్ పెదమత్తయ్య, వార్డు ప్రెసిడెంట్ నాగేంద్రమ్మ, ఎమ్మెల్యే హెచ్ పి సారిక, ఏ అన్ అమ్ కోటేశ్వరమ్మ, ఆశ వర్కర్ ఖశింబి, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ చోద కుడు ఏసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపిపి బైలడుగు రామయ్య

రేపటి బిసి గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరులో ఈ నెల 25వ తేదీన జయహో బిసి గర్జన కార్యక్రమం చేపట్టినట్లు సీనియర్ టిడిపి నాయకులు మాజీ ఎంపిపి బైలడుగు రామయ్య తెలిపారు. ముందుగా సభా ప్రాంగణంలో నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం బీసీ నాయకులు మాట్లాడుతూ వైసిసి పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదని, బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ మండల స్థాయి బిసి గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని బీసీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు.

వైసిపికి చిరుమామిళ్ల శ్రీను రాజీనామా

ప్రజాశక్తి -కారంపూడి

ఉమ్మడి గుంటూరు జిల్లా వైస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన చిరుమామిళ్ల. శ్రీను ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో చురుగ్గా పనిచేసిన ఆయన గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాడు. నర్స రావుపేట లోక్ సభ సభ్యులు లావు. శ్రీకృష్ణ దేవరాయులు వైసిపికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈయన కూడా రాజీనామా చేసినట్లు మీడియా కు తెలిపారు. శ్రీకృష్ణదేవ రాయలు తోనే తన రాజకీయ ప్రయాణమని చెప్పారు.

బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం పెంపునకు కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి వెల్లడించారు. 24వ తేదీన వయో బాలికల దినోత్సవం (యుక్త వయసు) ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జరుపుకోనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నేడు బాలికల్లో ఎక్కువగా ఎనీమియా తగ్గించు కునేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమం జరగనుందన్నారు. ఈ క్రమం లోనే జిల్లా వ్యాప్తంగా కిశోర బాలి కలలో ఎనీమియా శాతం తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, అంగన్ వాడీ, ఆశ వర్కర్లు ఈ పనిలో భాగ స్వాములై పని చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఆగస్టులోనే బాలికల్లో రక్తహీనత శాతం తగ్గించేందుకు, సమయుతమై పని చేస్తు న్నామని కలెక్టర్ వెల్లడించారు. కిషోర బాలికల్లో రక్తహీనత శాతం గుర్తించే ఎక్కడ లేని విధంగా హిమోగ్లోబిన్ కార్డు లను ప్రవేశపెట్టామని, తద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత శాతాన్ని గుర్తిం చడం జరుగుతుందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి ముఖ్యంగా బెల్లంతో చేసిన పదార్థాలు , ఖర్జూరం ,రాగి జావా చిక్కిలు,పండ్లు వంటివి సకాలంలో అందించాలన్నారు. జిల్లాలో 67 శాతం రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. సుమారు 1,19,000 మందిని పరీక్షించినట్లు వివ రించారు. బంగారు తల్లి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనుల వల్ల 49.5 శాతా నికి రక్తహీనత శాతం తగ్గిందని సుమా రుగా 17.8 శాతం వృద్ధి సాధించా మన్నారు. జిల్లాలో రక్త హీనత శాతాన్ని 9 శాతానికి తగ్గించడమే లక్ష్యమని అన్నారు. బంగారు తల్లి రికార్డుల ప్రకారం, బాలికల్లో రక్తహీనత శాతం తగ్గించి, వారిలో రక్తం శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెబుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పల్నాడు జిల్లాలో 35 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ



మాసోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్,జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ రోడ్డు ప్రమా దాల వివరాలు పరిశీలించి ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత డిపా ర్ట్మెంట్ అధి కారులు తక్షణం చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు పోలీస్, రవాణా, ఆర్.అండ్. బి, నేషనల్ హైవేస్,ఆరోగ్య శాఖలు సమ న్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహన దారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని సమా వేశంలో డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి.కె. పరందామరెడ్డి,కలెక్టర్‌కు వివరిం చారు. సెల్ ఫోన్ మాట్లాడుతు డ్రైవ్ చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని నడిపే వారు హెల్మెట్ ధరించేలా చూడాలని పోలీస్,రవాణా శాఖలను ఆదేశించారు. రొంపిచర్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా యని, అద్దంకి- నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మా ణానికి అవ కాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్‌బి ఇ.ఇ రాజ నాయిక్, పంచాయతి రాజ్ ఇ.ఇ.సుబ్బారాయుడు, ఆర్టీసీ ఆర్ ఎం. శ్రీనివాస రావు, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, ఎన్‌హెచ్ ఎఐ అధికారులు, రోడ్డు భద్రత అధి. కారులు దుర్గ, పద్మజ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఓటర్లదే కీలక పాత్ర

ప్రజాశక్తి - మాచర్ల



ఉత్తమ సమాజ నిర్మాణంలో ఓటర్లదే కీలక పాత్ర అని ఎం.ఇ.ఓలు వేముల నాగయ్య, ఆల్లి సురేష్‌లు అన్నారు. స్థానిక జడ్‌పి బాలుర హైస్కూల్‌లో 14వ ఓటర్ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ ఆయేషాసుల్తానా ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్, డిబెట్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.ఇ.ఓలు వేముల నాగయ్య, ఆల్లి సురేష్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఓటు విలువ గురించి ప్రతి ఒక్కరు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ సకినా,ఎం రామారావు, పి .అన్వర్‌ఖాన్, జె అరుణ, గిరిజ, అమరమహేష్, బి.శివకోటేశ్వరరావు, అమర్ నాధ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేటలో కేక్ కట్ చేస్తున్న జివి ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు తదితరులు

పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వ హించారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవి ఆంజనేయులు, నరసరావుపేట నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. ముప్పాళ్ల మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహాన్నికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. పెదకూరపాడు లో స్థానిక పార్టీ కార్యాలయంలో 41 కేజీల కేకును కట్ చేశారు. తెలుగు యువత నాయకులు సత్తెనపల్లిలోని శరభయ్య హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విజయపురిసౌత్ లో టీడీపీ,జనసేన నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి కేట్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండలంలో కొనకంచివారిపాలెంలో మంగళ వారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరము నిర్వహించారు. ఈ వైద్య శిబిరములో సంగం డెయిరీ పశువైద్యులు డాక్టర్ ప్రసాద్, ఆనంద్ బాబు, హర్షవర్ధన్ లు పాల్గొని పశువులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో 100 గేదెలకు వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు, గాలికుంటు వ్యాధులు రాకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ నరసరావుపేట పాలశీతలీకరణ మేనేజర్ వీరేంద్ర కుమార్, రూట్ సూపర్ వైజర్ కష్ణా రెడ్డి, సంగం డెయిరీ పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులు పొనుగోటి శ్రీనివాసరావు, సభ్యులు పొనుగోటి వెంకటేశ్వర్లు, గరికపాటి నాగయ్య, పాల ఉత్పత్తి దారులు, రైతులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్ర బోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సుభాష్ చంద్రబోస్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశ స్వాతంత్ర్య ఉద్యమం లో అత్యంత కీలక పాత్ర పోషించిన వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అని పలువురు నాయకులన్నారు. మంగళవారం పట్టణంలోని భాస్కర్ సెంటర్లో గల సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మద్దుల వెంకట కోటయ్య, ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, రాష్ట్ర కార్మిక, రైతాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సింగు లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నల్లపాటి తదితరులు

నల్లపాటి ప్రమీలాదేవికి నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖర్ భార్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ తల్లి ప్రమీలా దేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. నరసరావుపేట మండలంలోని జొన్నల గడ్డలో ఏర్పాటు చేసిన ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కడియాల వెంక టేశ్వరరావు., జనసేన ఇం చార్జి షేక్ జిలాని, ప్రమీల దేవి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 24 జనవరి 2024

నీటి మోటార్ల కోసం సోలార్ ప్లాంటు

- రోజుకు రూ.17 వేల వరకు ఆదా, ఆదాయం
- రానున్న కాలంలో మరిన్ని చోట్ల ప్లాంట్లు
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశం



ప్రజాశక్తి - గుంటూరు

సౌర విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణ హితంతో పాటు, ఖర్చులూ తగ్గించుకొని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్వహణపై కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో మంగళశారం సమీక్షించారు. గుంటూరు నగరపాలక సంస్థ సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగా సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో యునిడో సహకారంతో 3.5 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సుమారు రూ.4.75 కోట్లతో 500 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ రోజుకు సరాసరి 2 వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. జాగర్లమూడి నుండి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే మోటార్ల రన్నింగ్ కోసం రోజుకు 650 నుండి 1300 యూనిట్లను వినియోగించుకొని మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కు అమ్ముతామని తెలిపారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మోటార్ల రన్నింగ్‌కు వినియోగించడం ద్వారా రోజుకు సుమారు రూ.12,350 ఖర్చులు తగ్గుతుండగా, మిగిలిన విద్యుత్ అమ్మకం ద్వారా రోజుకు సుమారు రూ.4,555 ఆదాయం వస్తుందని వివరించారు. రానున్న వేసవిలో ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ నిర్వహణ 15 ఏళ్ల కాంట్రాక్ట్ సంస్థే భాధ్యత తీసుకుంటుందని, మరో పదేళ్ల పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్లాంట్ నుండి ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న విద్యుత్, వినియోగం, అమ్మకం తదితర వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు వల్ల చెరువులో నీటి ఆవిరి శాతాన్ని తగ్గించవచ్చని, ప్లాంట్ ఏర్పాటుకు అదనంగా భూమి కేటాయింపు అవసరం లేదని అన్నారు. రానున్న కాలంలో నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలోని బి.ఆర్.స్టేడియం రిజర్వాయర్ దగ్గర పాత 600 ఎంఎం డయా పంపింగ్ పైప్ లైన్ లీకు మరమ్మతుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుండి గురువారం సాయంత్రం వరకు తాగునీటి సరఫరా నిలిపేస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుండి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. రిజర్వాయర్ పరిధిలోని సుద్దపల్లి డొంక, ముఖ్దుం నగర్, అలీ నగర్, దుర్గ నగర్, యానాది కాలనీ, నాగలక్ష్మి నగర్, కృష్ణ నగర్, మల్లయ్య లింగ నగర్, పాత గుంటూరు బొడ్డురాయి సెంటర్, మాచిరాజు వారివీధి, ఇసుకవాగు సందు, బారా ఇమామ్ పంజా, ఆనందపేట, సంగడిగుంట, కబాడిగూడెం, రెడ్ల బజార్, మంత్రివారి వీధి, వడ్డెగూడెం, ఇందిరాకాలనీ, ఎల్ఆర్ కాలనీ, పొన్నూరు రోడ్, సాయిబాబా కాలనీ, హుస్సేన్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీ, ఐపిడి కాలనీ, ఎస్టీ కాలనీ, కొబ్బరికాయల సాంబయ్య కాలనీ, తిరుమలచారీ కాలనీ, కొత్త లక్ష్మారెడ్డి నగర్, ఉడా రోడ్, అమీన్ నగర్, ఏటుకూరు రోడ్ గాంధీ నగర్, దర్గామాన్యం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపేస్తామని, ప్రజలు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

జాతీయ కవితల పోటీలో విజేతగా ఆళ్ల నాగేశ్వరరావు



ప్రజాశక్తి-తెనాలి

అక్షరాల తోవ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు విజేతగా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ నుంచి ఈనెల 28న కవి సత్కారం అందుకోనున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన అక్షరాల తోవ సాహితీ సంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. 'మట్టి' అంశంపై నిర్వహించిన కవితల్లో నాగేశ్వరరావు 'మట్టి మహిమ' శీర్షికన రాసిన కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. ఈనెల 28న ఖమ్మంలో నిర్వహించే ప్రత్యేక సభలో నాగేశ్వరరావును అభినందించనున్నట్లు నిర్వాహకులు పంపిన ఆహ్వానాన్ని ఆయన అందుకున్నారు. ఆయన్ను పట్టణానికి చెందిన పలువురు సాహితీ ప్రియులు అభినందించారు.

మృతుని కుటుంబానికి పోస్టల్ శాఖ రూ.10 లక్షల చెక్కు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యుద్ఘాతంతో మృతి చెందిన మండలంలోని గొట్టిపాడుకు చెందిన బత్తుల రాజశేఖర్ కుటుంబానికి బీమా చెక్కును పోస్టల్ ఏపీ స్టేట్ ఏజీఎం ప్రకాష్ మంగళవారం అందించారు. రాజశేఖర్ పేరుమీద పోస్టాఫీసులో రూ.399 (జిఎజి) గ్యాగ్ పాలసీ చేసి ఉండటంతో అతని భార్య వాణికి రూ.10 లక్షల చెక్కును అందించారు. నరసరావుపేట బ్రాంచ్ మేనేజర్ మహేష్‌రెడ్డి, మణిచంద్రారెడ్డి, హర్ష పాల్గొన్నారు.



డ్రైవర్ల అప్రమత్తతోనే సుఖ ప్రయాణం

తెనాలి డివిజన్ ఆర్టీవో ప్రసాద్ - విజ్ఞాన్స్‌లో రహదారి భద్రతా మాసోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీవో ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రయాణీకులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్యమవుతుందని తెనాలి డివిజన్ ఆర్టీవో ప్రసాద్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మంగళవారం విజ్ఞాన్స్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెనాలి డివిజన్ ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలను చేయకూడదని అన్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో పనిచేసే డ్రైవర్లు మరింత అప్రమత్తతో పాటు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించొద్దని చెప్పారు. ప్రతి మూణ్ణెల్లకు ఒకసారి డ్రైవర్లందరూ మెడికల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశ్యంతో డ్రైవర్లకు అవగాహన కల్పించే విధంగా భద్రతా మాసోత్సవాలను నిర్వహిన్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని పదేపదే అవగాహన కల్పిస్తున్నా సామాన్య ప్రజలు పెడచెవిన వేస్తున్నారన్నారు. పొరపాటున జరగరానిది ఏదైనా జరిగితే బస్సులో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్ అందుబాటులో పెట్టుకోవాలన్నారు. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు విద్యార్థులను ఎక్కడం, దిగడానికి అనుమతించుకూడదని హెచ్చరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాఘవరావ్, ఎస్.బీ.మధుసూదన్‌రావ్, జిల్లా రోడ్ సేఫ్టీ మేనేజర్ షేక్‌సాదిక్, రోడ్ సేఫ్టీ డ్రైవింగ్ ట్రైనర్ జగదీష్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్ విద్యార్థినికి కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం



ప్రజాశక్తి-తెనాలి : స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ విద్యార్థిని 'కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' ప్రశంసాపత్రం అందుకున్నారు. పాఠశాలలో మంగళశారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి మాట్లాడారు. ఏడో తరగతి విద్యార్థిని అయిన ఎం.లక్ష్మీ కార్తీక కూచిపూడి నృత్యంలో ఎంతో ప్రావీణ్యం పొందారు. గతేడాది డిసెంబర్ 24న హైదరాబాద్ గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో కూచిపూడి వైభవం పేరిట 'లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్' పేరిట ఏకకాలంలో 3,783 మంది బృందం ఏడు నిముషాల నిడివి కలిగిన కూచిపూడి నృత్యం చేశారు. ఆ బృందంలో లక్ష్మీ కార్తీకకు కూడా స్థానం లభించింది. ఈ నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ నేపథ్యంలో బృందంలో పాల్గొని నృత్యం చేసిన లక్ష్మీ కార్తీకకు కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పేరిట ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు పంపించారు. ఆ పత్రాన్ని కార్తీకకు మురళీకాంత్ దాసరి అందించి అభినందించారు.


అన్న క్యాంటీన్ వద్ద భోజనం వడ్డిస్తున్న నాయకులు

దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రమైన దుగ్గిరాల రైలునపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదవాడికి పట్టెడు అన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారని, వాటిని జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని విమర్శించారు. అయితే టిడిపి ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేస్తున్నామని, మంగళగిరి నియోజకవర్గంలో మంగళగిరి, తాడేపల్లి తర్వాత ఇది మూడవదని చెప్పారు. వీటిని ఇలానే కొనసాగిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటరావు, కె.శ్రీఅనిత, వి.శ్రీకృష్ణప్రసాద్, జి.శ్రీనివాస్, టి.సీతారామయ్య, కె.బాబు, జె.నరేంద్ర, జె.సుబ్బారావు జనసేన మండల అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, పి.సాయి చైతన్య పాల్గొన్నారు.



జిపి పవర్ లిఫ్టింగ్ ప్రాంగణ పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని గుమ్మడి పుల్లేశ్వరరావు పేరుతో నిర్మించిన పవర్ లిఫ్టింగ్ జోన్ ప్రాంగణాన్ని సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల కోటేశ్వరావు మంగళవారం సందర్శించారు. మంగళగిరిలో పుల్లేశ్వరరావు పేరుతో పవర్ లిఫ్టింగ్ జోన్ నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, కోశాధికారి జి.బద్రీనాథ్, ఉపాధ్యక్షులు షేక్ సంధాని, సభ్యులు కె.విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఆధునీకరించిన కాకుమాను సత్రం నేడు ప్రారంభం



ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ప్రసిద్ధి చెందిన కాకుమాను శంకరుని ధర్మసత్రం ఆధునీకరణ అనంతరం బుధవారం ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించనున్నారని కాకుమాను శరత్‌బాబు మంగళవారం తెలిపారు. ఎంతో మందికి ఆశ్రయం కల్పించిన కాకుమాను శంకరుని ధర్మసత్రం ఎన్నో ఏళ్ల క్రితం బోసరోడ్డులో ఏర్పాటైంది. ఈ ధర్మసత్రంలో వివిద ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిన వారికి ఆశ్రయం కల్పించటంతో పాటు పేదలకు భోజన వసతి కల్పిస్తుంది. వ్యవస్థాపకులు గతించినా వారి వారసులు శరత్‌బాబు ఇప్పటికీ పేద విద్యార్థులు ఉపకార వేతనాలు, పేదలకు అన్న, వస్త్రదానం వంటి కార్యక్రమాలను వ్యవస్థాపకులైన కాకుమాను శంకరుని జయంతి, వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మరమ్మతులు, అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న ధర్మసత్రాన్ని ప్రారంభానికి సిద్ధం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 26న వాహన ర్యాలీ

ప్రజాశక్తి-తాడేపల్లి

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26 రిపబ్లిక్ డే సందర్భంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించాలని రైతు సంఘం, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐద్వా నాయకులు కోరారు. మంగళవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, పంటకు మద్దతు ధర చట్టం చేయాలని కోరారు. కార్మికులకు విఘాతంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో పని దినాలు 200 రోజులకు పెంచాలని, కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకో వాలన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించా లన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరారు. విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో డి.వెంకట రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె పీరూసాహెబ్, ఎన్.కిషోర్‌బాబు, డి.సామ్యేలు, టి.వెంకటయ్య, కె.మేరి, కె.నాగరాజు పాల్గొన్నారు.

ఉపయోగించని చెక్‌బుక్‌లు దహనం



ప్రజాశక్తి-గుంటూరు : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా ఖజానా, ఉపఖజానా కార్యాలయాలలోని స్ట్రాంగ్ రూములలోని ఉపయోగించబడని, కొంత వాడబడని చెక్ బుక్కులను దహనం చేశారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం 5889 చెక్కు బుక్కులను జిల్లా వ్యవసాయ కార్యాలయ పరిపాలనాధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సమక్షములో జిల్లా ఖజానా కార్యాలయ ప్రాంగణములో బి.రాజగోపాలరావు, జిల్లా ఖజానా లెక్కల అధికారులు, సహాయ ఖజానా అధికారులు ఎ.ఫణీంద్రరాజు, ఘని, ఉప ఖజానా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





లబ్ధిదార్లకు మెగా చెక్కులను అందిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎల్.శివశంకర్, ప్రజాప్రతినిధులు

డ్వాక్రా మహిళలకు నాలుగో ఏడాది ఆసరా

గుంటూరు జిల్లాలో రూ.247 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.231.69 కోట్లు జమ

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక అభివద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మహిళలు ఆయా పథకాలను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మంగళవారం జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి వరుసగా నాలుగవ ఏడాది వైయస్సార్ ఆసరా క్రింద స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని సభ్యుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలక్టరేట్ నుండి నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, కృష్ణ బలిజ, పూసల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, ఎ.పి.విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సహాయ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, డీఆర్డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, వెంకట నారాయణ లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు విడతల్లో రూ.739 కోట్లు విడుదల చేసిందని, నాలుగో విడతలో 29,392 స్వయం సహాయక సంఘాల్లోని 2,86,466 మంది లబ్ధిదారులకు రూ.247.22 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. బ్యాంక్ లింకేజీ ద్వారా పెద్ద ఎత్తున రుణాలు ఇప్పించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆసరా 4వ విడత సంబరాలపై రూపొందించిన గోడ పత్రిక, స్టికర్లను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, లబ్ధిధారులు పాల్గొన్నారు. జిల్లాకు విడుదలైన నిధుల వివరాలను నియోజకవర్గాల వారీగా కలెక్టర్ వివరించారు. చికలకూరిపేట నియోజక వర్గంలో 44635 మందికి రూ.36.57 కోట్లు, గురజాల నియోజకవర్గంలో 39703 మందికి రూ.25.20 కోట్లు, మాచర్ల నియోజకవర్గంలో 47367 మందికి రూ.40.50 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 37190 మందికి రూ.29.87 కోట్లు, పెదకూరపాడు నియోజక వర్గంలో 40340 మందికి రూ.31.16 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 44458 మందికి రూ.37.87 కోట్లు, వినుకొండ నియోజకవర్గంలో 43434 మందికి రూ.30.51 కోట్లు, జిల్లా మొత్తంగా 30,296 స్వయం సహాయక గ్రూపుల్లోని 2,97,127 మందికి రూ.231.69 కోట్లను జమ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదార్లకు మెగా చెక్కును అందించారు.

వర్సిటీలో అంతర్ కళాశాలల నెట్‌బాల్ పోటీలు



వర్సిటీలో అంతర్ కళాశాలల నెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి- ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పురుషుల నెట్‌బాల్ , బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం జరిగాయి. ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో నెట్‌బాల్‌కు నాలుగు జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో ఏడు జట్లు పాల్గొన్నాయి. పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు ఎఎన్‌యు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జాన్సన్ బహుమతులు అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్‌లో బాపట్ల జిల్లాలోని నగరం మండల కేంద్రంలో ఉన్న ఎస్వీ ఆర్ఎంఎం మొదటి స్థానం, ఎస్కేఆర్ బిఆర్ కళాశాల రెండవ స్థానం, వర్సిటీ వ్యాయామ కళాశాల 3వ స్థానం, నాలుగవ స్థానంలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల నిలిచాయి. నెట్‌బాల్ పోటీల్లో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రథమ స్థానం, డిఆర్ఎన్ఎస్ఎస్ విఎస్ కళాశాల రెండవ స్థానం, ఎఎన్‌యు ఇంజినీరింగ్ కళాశాల మూడో స్థానం, ఎఎన్‌యు వ్యాయామ కళాశాల నాలుగో స్థానాల్లో నిలిచాయి. పోటీల నిర్వహణను వర్సిటీ యోగా సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, ధనలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు.



దేవిడ్ ఫాలన్‌కు సన్మానం చేస్తున్న వై.వి.ఆంజనేయులు

ఐర్లాండ్‌లో ఉద్యోగావకాశాలపై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

ఫార్మసీ విద్యకు ఐర్లాండ్ దేశంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఐర్లాండ్ లియోగ్లోబల్ ఓవర్‌సీస్ అంతర్జాతీయ పరిపాలన సలహాదారులు డేవిడ్ ఫాలన్ అన్నారు. ఐర్లాండ్‌లో విద్య, ఉద్యోగావకాశాలపై మంగళవారం లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో నిర్వహించిన సదస్సులో డేవిడ్ ఫాలన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, గుంటూరు శాఖ మేనేజర్ అమూల్య పాల్గొని ప్రసంగించారు. డేవిడ్ ఫాలన్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక వేతనం తీసుకుంటున్న వారిలో రెండు శాతం విద్యార్థులు ఐర్లాండ్ నుండి వెళ్లిన వారేనని తెలిపారు. దాదాపు 7500 మంది విద్యార్థులు ఐర్లాండ్‌లో చదువుతున్నారని, భారత దేశస్తులు సుమారు 80వేల మంది అక్కడ స్థిరపడ్డారన్నారు. ఫైజర్, ఆపిల్, ఇంటెల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు ఈ దేశ సంపద అని, సాఫ్ట్‌వేర్, మెడ్‌టెక్, ఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్స్‌ను ఎగుమతి చేసే దేశాలలో ఐర్లాండ్ ఒకటని చెప్పారు. ప్రతి సంవత్సరం వెయ్యికిపైగా నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయని, అంతర్జాతీయ ఫార్మా ఎగుమతులలో 50శాతం ఐర్లాండ్ నుండే జరుగుతుందని అన్నారు. ఫార్మాస్యూటికల్ హెల్త్‌సైన్స్, బయోటెక్నాలజీ, బయో మెడికల్ ఇంజినీరింగ్, హాస్పిటాలజి వంటి కోర్సులకు అత్యధిక ఆదరణ ఉందన్నారు. అంతేకాకుండా వీసా, స్టైఫండ్ తదితర వివరాల గురించి తెలియజేశారు. అనంతరం చలపతి అధినేత వై.వి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు సత్కరించారు.

15, 16 తేదీల్లో ఆర్‌విఆర్‌లో 'కొలరిడో'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలేజి సెక్రెటరీ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఫిబ్రవరి 15, 16 తేదీల్లో రెండ్రోజుల పాటు 'కొలరిడో' పేరుతో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజేతలకు రూ.5 లక్షల వరకూ నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు చెప్పారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల సిబ్బంది, వివిధ శాఖాధిపతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్, సాంస్కృతికం, క్రీడల విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. అనేక రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. పోటీలకు సంబంధించిన సమాచారం కోసం http//rvrjcce.ac.in/colorido2k24/ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని పల్నాడు జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా రెడ్ క్రాస్ జూనియర్ అండ్ యూత్ సబ్ కమిటీ సభ్యుల సమావేశం జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 50 వేల మందిని నమోదు చేయాలన్నారు. డిగ్రీ కళాశాలలకు ఇన్‌ఛార్జిగా డాక్టర్ సుధాకర్, ఫార్మసీ కళాశాల ఇన్‌ఛార్జిగా డాక్టర్ సురేష్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాలల ఇన్‌ఛార్జిగా డాక్టర్ శ్రీనివాస్, పాఠశాలలకు ఇన్‌ఛార్జిగా వెంకటరావును నియమించారు.

